క్లుప్తంగా

అంగన్‌వాడీ, సచివాలయాలకు పీఎం మోదీ చిత్రాలు అందజేత

గుంటూరు మెడికల్: బీజేపీ రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు ఆధ్వర్యంలో పల్లెకు పోదాం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. పశ్చిమ నియోజకవర్గంలోని అంగన్‌వాడీలు, సచివాలయాలు సందర్శించి ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటాలు అందజేశారు. అనంతరం స్థానిక రామిరెడ్డి నగర్ మెయిన్ రోడ్డులో రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాల్లో అప్పిశెట్టి రంగారావు, ధార్మిక సెల్ కన్వీనర్ ప్రతాప్ ప్రసాద్, ఏలూరు లక్ష్మి, జిల్లా కార్యదర్శి బాదాం శ్రీనివాసరావు, బాలకృష్ణ పాల్గొన్నారు.

అలరించిన భక్తి సినీ సంగీత విభావరి

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై ఆదివారం సాయంత్రం మహతీ స్వరసుధ రజతోత్సవ వేడుకలు నిర్వహించారు. పామిడి ఘంటం వెంకట సుబ్బారావు, వెంకటసత్యనారాయణ, వాసుదేవ రావు, ధర్మజ్యోతి, పాలకమండలి అధ్యక్షులు సీహెచ్. మస్తానయ్య జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. గాయని గాయకులు పత్రిని ర్మల, సుధా, రాజ్యలక్ష్మీ, జరీనా, ప్రద్యుమ్న, హరికృష్ణ, కమల్ కిషోర్, బి.వీరయ్య తదితరులు తమ గాత్రంతో భక్తి, సినీ గీతాలను అలపించారు. కీబోర్డ్‌పై కె.రవిబాబు, తబలాపై ఎస్.వెంకట్, పాడ్స్‌పై టి.ఈశ్వర్ వాయిద్యాన్ని అందించారు. అనంతరం కళాకారులను, అతిథులను సత్కరించారు.

శ్మశానాన్నీ వదలని కూటమి నేతలు

- గుజ్జన గుండ్ల శ్మశాన వాటికలో షాపుల నిర్మాణం
- పట్టించుకొని పట్టణ ప్రణాళిక అధికారులు
- దీనిపై ఫిర్యాదు రావడంతో నిర్మాణ పనులను ఆపివేసిన కమిషనర్
- తిరిగి పనులు ప్రారంభించేందుకు ప్రయత్నాలు



గుజ్జనగుండ్ల మెయిన్‌రోడ్డులో హిందూ శ్మశాన వాటికలో చేపడుతున్న షాపింగ్ కాంప్లెక్స్

నెహ్రూనగర్: కూటమి నేతలు రెచ్చిపోతున్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని తెగబడుతున్నారు. ప్రభుత్వ స్థలాలను కబ్జా చేయడంతో పాటు శ్మశాన వాటికలను వదలడం లేదు. గుజ్జనగుండ్ల మెయిన్ రోడ్డులోని హిందూ శ్మశాన వాటికలో రోడ్డు వెంబడి ఉన్న ఖాళీ స్థలంపై స్థానికంగా కూటమి నేతల కన్ను పడింది. గత ప్రభుత్వంలో అక్కడ షాపులు వేయాలని చూసినా ఫలితం లేక పోవడంతో.. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కూటమిలోని ఓ వర్గానికి చెందిన వారు అక్కడ హవా కొనసాగిస్తూ రెండు ఫోర్లు షాపులు నిర్మాణం చేపట్టారు. ఇంత జరుగుతున్న పట్టణ ప్రణాళిక అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంపై నగర కమిషనర్‌కు పలు ఫిర్యాదులు రావడంతో గత కొద్ది రోజుల క్రితం కమిషనర్ పులి శ్రీనివాసులు సదరు షాపులను పరిశీలించి నిర్మాణ పనులు ఆపివేయాలన్నారు.

15 సెంట్లలో షాపింగ్ కాంప్లెక్స్

గుజ్జనగుండ్ల హిందూ శ్మశాన వాటిక 1.40 ఎకరాల విస్తీర్ణంలో ఉండేది. రెండు సార్లు రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా సదరు స్థలం రోడ్డు విస్తరణలో పోవడంతో ప్రస్తుతం 1.10 ఎకరం మాత్రమే ఉంది. సుమారు 15 సెంట్లలో షాపులను నిర్మించేందుకు కూటమి ప్రభుత్వంలోని ఓ వర్గానికి చెందిన కూటమి నేతలు కుట్రలు పన్నారు. ప్రస్తుతం గుజ్జనగుండ్ల మెయిన్ రోడ్డులో గజాం 1.30 నుంచి 1.50 లక్షల దాకా మార్కెట్ విలువ ఉంది. కింద 12, పైన 13 షాపులు ఒక షాపులకు రూ.3.50లక్షలు దాకా వసూలు చేసి నిర్మాణం చేపట్టారు. స్థానిక ఎమ్మెల్యే అండదండలతో నేతలు రెచ్చిపోయి అక్కడ షాపులు నిర్మాణం చేపడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని మాకు కూడా షాపులు కేటాయించాలని గత కొద్ది రోజుల క్రితం స్థానికులు ఎమ్మెల్యేను కలసి ఫిర్యాదు చేశారు.

కౌన్సిల్ పాస్ చేయించేందుకు కుట్రలు

ప్రస్తుతం నిర్మాణ పనులను కమిషనర్ పులి శ్రీనివాసులు ఆపివేయించారు. సదరు షాపుల నిర్మాణానికి ఎటువంటి అడ్డంకులు లేకుండా చూడాలని ప్రభుత్వ పెద్దల నుంచి కమిషనర్‌పై తీవ్ర ఒత్తిళ్లు వస్తున్నట్లు సమాచారం. ఇందులో భాగంగానే సదరు షాపులను ప్రస్తుతం ఎవరైతే నిర్మించుకుంటున్నారే వారికే దక్కే విధంగా కౌన్సిల్‌లో పాస్ చేయించుకునేందుకు కూటమి నేతలు కుట్రలు పన్నినట్లు తెలుస్తుంది. ఇందులో భాగంగానే తిరిగి పనులు పూర్తి చేసేందుక స్థానిక కూటమి నేతలు పావులు కదుపుతున్నారు. దీనిపై స్థానికులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. కేవలం ఒక వర్గం వారే షాపులను దక్కించుకోవాలని చూడటం ఎంత వరకు కరెక్ట్ అని దీనిపై ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఓపెన్ ఆక్షన్ పెట్టాలి



గుజ్జన గుండ్ల శ్మశాన వాటికలో షాపులను కూటమి నేతలు తమ అనుకునే వారికే కేటాయించుకుంటున్నారు. దీనిపై ఎమ్మెల్యేను కలసి వినతి పత్రం ఇచ్చాం. షాపులను కేవలం ఒక వర్గానికే కాకుండా అన్ని వర్గాలకు వర్తింపజేసే విధంగా ఓపెన్ ఆక్షన్ పెడితే చాలా మందికి ఉపయోగపడుతుంది.

– బ్రహ్మం, గుజ్జనగుండ్ల

కార్పొరేషన్ వేలం వేయాలి



గుజ్జనగుండ్ల శ్మశాన వాటికలో నిర్మిస్తున్న షాపింగ్ కాంప్లెక్స్‌ను నగరపాలక సంస్థ ఆధీనంలోకి తీసుకుని నిజమైన పేదలకు కేటాయిస్తే వారికి మేలు చేసిన వారవుతారు. కాని ఇక్కడ అలా కాకుండా కేవలం కొంత మంది మాత్రమే షాపులను దక్కించుకోవాలని చూస్తున్నారు.

– గుర్రాల పాములయ్య, స్థానికుడు

వృద్ధులు, దివ్యాంగులకు బియ్యం పంపిణీ



నగరంపాలెం: సమాజంలో ఒంటరిగా జీవించే వయో వృద్ధులు, దివ్యాంగులను ఆదరించాలని శ్రీహనుమాన్ ఆదర్శ సేవా సమితి అధ్యక్షుడు మామిడి మురళీకృష్ణ అన్నారు. కొత్తపేటలోని సమితి కార్యాలయంలో ప్రతి నెల రెండో ఆదివారంలో భాగంగా వయోవృద్ధులు, దివ్యాంగులకు బియ్యం, 11 రకాల నిత్యావసర వస్తువుల కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబ సభ్యుల ఆదరణ కరువై, వృద్ధాప్యంతో జీవనం పోరాటం చేస్తున్నారని అన్నారు. అటువంటి వారికి సహాయ, సహకారాలు అందించాలని ఆయన దాతలను కోరారు. దాతల సహకారాలతో మరెన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో జనసేన 18వ డివిజన్ అధ్యక్షుడు శానం రమేష్, సమితి కార్యదర్శి మాదాల ప్రకాష్, కోశాధికారి ఎస్‌వీ.రమణ, బియ్యం కమిటి చైర్మన్ పోలేపల్లి వెంకటసుబ్రహ్మణ్యం, కమిటీ సభ్యులు మామిడి వెంకటశ్రావణ్, పోలేపల్లి లహరి పాల్గొన్నారు.

ఇంటర్‌లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో నారాయణ డీజీఎం శ్రీనివాసులురెడ్డి



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ విజయలక్ష్మి

గుంటూరు ఎడ్యుకేషన్: ఇంటర్మీడియెట్ పరీక్షా ఫలితాల్లో శ్రీ మాజేటి గురవయ్య జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యధిక ఫలితాలు సాధించి సత్తా చాటారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాధవపెద్ది విజయలక్ష్మి పేర్కొన్నారు. ఆదివారం బ్రాడీపేటలోని కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులకు స్వామి వివేకానంద 'విన్నింగ్ ఫార్ములాస్' పుస్తకాలను అందజేసి అభినందించారు. ఆమె మాట్లాడుతూ జూనియర్, సీనియర్ ఇంటర్లో 130 మంది ఎంపీసీ గ్రూప్ నుంచి పరీక్షలు రాయగా 71 శాతం మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో పాల్ రియాన్ 862, వరుణ్ సాయి 836 మార్కులు సాధించారని వివరించారు. ప్రథమ సంవత్సర ఎంపీసీలో తేజస్విని, సీఈసీలో మోహన్ కృష్ణ అత్యధిక మార్కులు సాధించి కళాశాల గౌరవ ప్రతిష్టలు ఇనుమడింప చేశారన్నారు. ఈ సందర్భంగా తమను ప్రోత్సహిస్తున్న కళాశాల కార్యదర్శి మాజేటి వెంకట రామకోటి ముత్యాలు, అధ్యక్షులు గుడివాడ రూపచంద్రరావుకు కృతజ్ఞతలు తెలిపారు.

గుంటూరు ఎడ్యుకేషన్: ఇంటర్మీడియెట్ పరీక్షా ఫలితాల్లో పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ చూపారు. నల్లచెరువులోని నగరపాలక సంస్థ ప్రాథమికోన్నత పాఠశాలలో 7వ తరగతి వరకు, ఆర్.అగ్రహారం లోని కావటి శంకరరావు ఉన్నత పాఠశాలలో టెన్త్ వరకు చదివిన విద్యార్థులు శనివారం ప్రకటించిన ఫలితాల్లో సత్తా చాటారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో షేక్ రిహానా



షేక్ రిహానా కౌసర్



షేక్ రోషన్

కౌసర్ 470కి 452 మార్కులు, షేక్ రోషన్ 449 మార్కులు సాధించారు. అత్యుత్తమ ప్రతిభ విద్యార్థులను నల్లచెరువు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మేడిద రాజు, ఎస్టీయూ నాయకులు కొరివి విజయ బాబు, ఉగ్గం మహంకాళ రావు, ఉపాధ్యాయులు అభినందించారు.

ఇంటర్ ఫలితాల్లో నారాయణ విద్యార్థుల ప్రతిభ

గుంటూరు ఎడ్యుకేషన్: ఇంటర్మీడియెట్ పరీక్ష ఫలితాల్లో నారాయణ జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు విద్యాసంస్థల డీజీఎం శ్రీనివాసులురెడ్డి, కోర్ డీన్ తార్నాక చంద్రశేఖర్ తెలిపారు. బృందావన్‌గార్డెన్స్‌లోని సంస్థ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ జూనియర్ ఇంటర్ ఎంపీసీలో షేక్ కరిష్మా, ఎండీ ఖయ్యూం, కేవీ కార్తీక్ 466 మార్కులతో పాటు 465కి పైగా 16 మంది, 464 పైగా 42 మంది, 463కు పైగా 82 మంది, 460కి పైగా 154 మంది ఉన్నారని తెలిపారు. బైపీసీ విభాగంలో సీహెచ్ మహాలక్ష్మి, ఎస్.తహసీన్, పి.సైమా 435 మార్కులు సాధించగా, 430కి పైగా సాధించిన వారు 16 మంది ఉన్నట్లు పేర్కొన్నారు. సీనియర్ ఎంపీసీ, బైపీసీ విభాగాల్లో వెయ్యికి 990, 989, 988, 987, 986తో పాటు 985కి పైగా 30 మంది, 980కి పైగా 91 మంది ఉన్నట్లు వివరించారు. నిపుణులైన అధ్యాపకులతో ప్రణాళికాబద్ధమైన బోధన, ఒత్తిడి లేని సన్నద్ధతతో అత్యుత్తమ విద్యాబోధన అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డాన్లు వల్లభరావు, కోటేశ్వరరావు, మురళి, సుభానీ, ఏజీఎంలు హనుమంతరావు, రాజు, రామకృష్ణ, రామారావు, అపర్ణ, ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు పాల్గొన్నారు.

50 ఏళ్లకు అపూర్వ కలయిక



గుంటూరు ఎడ్యుకేషన్: ఏటీ అగ్రహారంలోని ఎస్‌కేబీఎం నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాల 1975–76 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం బ్రాడీపేటలోని ఓ హోటల్లో అర్ధ శతాబ్దపు అపూర్వ కలయిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకనాడు విద్యార్థులుగా కలిసిమెలసి చదువుకున్న సహచర మిత్రులను కలుసుకున్న ఆనందంలో పూర్వ విద్యార్థులు మునిగితేలారు. ఆప్యాయంగా పలకరించుకుని గత స్మృతులను గుర్తు చేసుకున్నారు. విశ్రాంత అధ్యాపకుడు కె.వేణుగోపాల్, వివిధ రంగాల్లో పనిచేసే ఉద్యోగ విరమణ పొందిన చంద్రశేఖర్, సిహెచ్.రామారావు, కృష్ణ మోహన్, ఎస్ఎం సుభాని, రామనాథం, జయప్రద, విశ్వనాధ రెడ్డి శేష సాయి, పి.వి.శర్మ పాల్గొన్నారు.

అందరికీ అంబేడ్కర్ స్ఫూర్తిదాయకం



నెహ్రూనగర్: భారత సమాజాన్ని నిరంతరం నడిపిస్తున్న మహాశక్తి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని.. ఆయన భావాలకు మరణం లేదని పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి అన్నారు. నెహ్రూ యువ కేంద్ర సంఘటన్ గుంటూరు, నగర పాలక సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ముందస్తు జయంతి వేడుకలు లాడ్జి సెంటర్ కూడలిలో ఆదివారం నిర్వహించారు. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనమైన నివాళులర్పించారు. నెహ్రూ యువ కేంద్ర సంఘటన్ ఆంధ్రప్రదేశ్ స్టేట్ డైరెక్టర్ అంశుమాన్ ప్రసాద్ దాస్ మాట్లాడారు. అనంతరం లాడ్జిసెంటర్ అంబేడ్కర్ విగ్రహం నుంచి ఎన్టీఆర్ స్టేడియం వరకు జరిగిన పాదయాత్రకు ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్ర గుంటూరు జిల్లా యువ అధికారి కిరణ్మయి దేవిరెడ్డి, డెప్యూటీ కమిషనర్ టి.వెంకట కృష్ణయ్య, ప్రాజెక్ట్ ఆఫీసర్ జె.రామారావు , డీఈఈ ఎం.రమేష్ బాబు, ఎస్ఎస్ఎస్ డిస్ట్రిక్ట్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ జేవీ సుధీర్ కుమార్, స్టెప్ మేనేజర్ రాధిక, ఎన్‌సీసీ బెటాలియన్ నాయబ్ సుబేదార్ సూర్యకాంతి కోరాదే పాల్గొన్నారు.

శారీరక, మానసిక స్థైర్యాన్ని అందించే క్రీడలు



గుంటూరు ఎడ్యుకేషన్: క్రీడలు శారీరక దారుఢ్యానికి కాకుండా మానసిక స్థైర్యాన్ని, సహనాన్ని అందిస్తాయని ప్రభుత్వ మహిళా కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణవేణి పేర్కొన్నారు. ఆదివారం అమరావతిరోడ్డులోని హిందూ మేనేజ్‌మెంట్, పీజీ కళాశాలల్లో ఎంబీఏ, ఎంబీఏ హాస్పిటల్ మేనేజ్‌మెంట్, ఎంసీఏ విద్యార్థులకు రెండురోజులపాటు నిర్వహించిన ఇన్‌డోర్, అవుట్‌డోర్ క్రీడలు ముగిశాయి. ఈసందర్భంగా ఆదివారం జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కృష్ణవేణి మాట్లాడుతూ క్రమశిక్షణ అలవర్చడంలో క్రీడలు కీలకపాత్ర పోషిస్తాయని, క్రీడా పోటీల్లో విజయం దక్కడం కంటే పాల్గొనడం ఎంతో ముఖ్యమన్నారు. ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించి, ఎదుటివారిని గౌరవించేలా మానవీయతను నేర్పుతాయని అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ రమణ మాట్లాడుతూ క్రీడా, ఆటల పోటీలను విద్యార్థులే నిర్వహించే విధంగా వారికి శిక్షణ కల్పించినట్లు తెలిపారు. కనుమరుగైపోతున్న కబడ్డీ ఆటను ప్రోత్సహించే ధ్యేయంతో సంబంధిత క్రీడను కళాశాలలో నిర్వహించామని తెలిపారు. కబడ్డీతో పాటు బ్యాడ్మింటన్, చెస్, కేరమ్స్, వాలీబాల్, త్రోబాల్ పోటీలను విద్యార్థినీ, విద్యార్థులకు వేర్వేరుగా నిర్వహించినట్లు వివరించారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ పి.రవి, ఎంబీఏ, ఎంసీఏ విభాగాధిపతులు డాక్టర్ చక్రవర్తి, రాజ్యలక్ష్మి, ఐక్యూఏసీ డైరెక్టర్ డాక్టర్ కె.లలిత, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ డాక్టర్ కళ్యాణి, ప్లేస్‌మెంట్ డైరెక్టర్ సీహెచ్ వైష్ణవి, సహాయాచార్యులు వేదవతి, బాజీబాబు, అభిలాష్, అనిత, రాజరాజేశ్వరి, శశికళ, విద్యార్థులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మట్టల ఆదివారం



నగరంపాలెం: స్థానిక కొత్తపేట కుగ్లర్ ఆస్పత్రి ఆవరణలోని ట్రినిటి గురు మండలంలో మట్టల ఆదివారం నిర్వహించారు. చిన్నారులు వివిధ రకాల పూలతో మట్టలు చేతపట్టుకుని పరిసర ప్రాంతాల్లో ప్రదర్శన చేశారు. ప్రార్థన గీతాలను అలపించారు. ఈ సందర్భంగా పరిశుద్ధ ఆరాధనలు జరిగాయి. అనంతరం రెవ.డాక్టర్ ఆర్.జీవకుమార్ దేవుని వాక్యం ప్రజలకు దీవెనకరంగా బోధించారు. ఎమ్మెల్యే నసీర్ అహ్మద్, రెవ.జె.దైవాశీర్వాదం, రెవ.పి.రమేష్, బత్తుల లెనిన్, ప్యారిష్ కోశాధికారి బి.గ్రేస్ సుదర్శనం పాల్గొన్నారు.